క్లుప్తంగా

జగదీశ్ ఆశయాలను కొనసాగించాలి



చిన్నచింతకుంట: ప్రజాసమస్యలపై పలు పోరాటాలు చేసి అమరుడైన కామ్రేడ్ జగదీశ్ ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని సీపీఐ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాంచందర్ పేర్కొన్నారు. శనివారం లాల్‌కోటలో జగదీశ్ 9వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జీఎస్ దేవదానం, సాంబశివుడు, కొండన్న, నర్సింహులు, వెంకటేశ్, గోపాల్, రాజు, నర్సింహులు, పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రేరణ విద్యార్థులు



జడ్చర్ల టౌన్: వరంగల్‌లో ఆదివారం నుంచి జరగబోయే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు మున్సిపాలిటీ పరిధిలోని ప్రేరణ బ్రిలియంట్ ఉన్నత పాఠశాలకు చెందిన విష్ణు, మహా, కార్తీక ఎంపికైనట్లు హెచ్‌ఎం గోపీనాథ్ తెలిపారు. లాంగ్‌జంప్, బ్రాండ్‌జంప్, రన్నింగ్ అండర్-10 విభాగంలో విద్యార్థినులు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శనివారం పాఠశాలలో అభినందించి వరంగల్‌కు పంపించారు. కార్యక్రమంలో పీఈటీ బాలు, ఉపాధ్యాయురాలు అమరావతి పాల్గొన్నారు.

'అసంపూర్తి రోడ్డును పూర్తి చేయండి'

హన్వాడ: మండలకేంద్రం నుంచి దొర్రితండాకు వేయాల్సిన బీటీరోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు దొర్రితండా రోడ్డును పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా అస్తవ్యస్తం అయ్యిందన్నారు. నిత్యం మండల కేంద్రానికి వచ్చే గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ బాలరాజు, నాయకులు నరేందర్, లక్ష్మయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు సన్మానం



నవాబ్‌పేట: మండలంలోని యన్మన్‌గండ్ల ప్రభుత్వ హాస్టల్‌లో ఉండి పదో తరగతి చదివిన విద్యార్థులకు జిల్లాలో కొత్తగా ఏర్పాటైన ట్రిపుల్ ఐటీలో స్థానం లభించిందని హాస్టల్ వార్డెన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ట్రిపుల్ ఐటీలో స్థానం పొందిన విద్యార్థులు సిద్ధు, చందనను తహసీల్దార్ శ్రీనివాస్ సన్మానించి అభినందించారు.

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో మెరిసిన ముగ్గురు విద్యార్థినులకు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. బాదేపల్లి బాలుర జెడ్పీ హైస్కూల్‌కు చెందిన అనన్య, తేజశ్విని, బాలికల జెడ్పీహైస్కూల్‌కు చెందిన సందోళ్ల శ్రీవిద్యకు సీటు లభించిందని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలియజేశారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన తేజశ్విని, అనన్యను బాదేపల్లి బాలుర పాఠశాల హెచ్‌ఎంలు చంద్రకళ, శ్రీవిద్యను బాదేపల్లి బాలికల పాఠశాల హెచ్‌ఎం లక్ష్మితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం



నవాబ్‌పేట: మండలంలోని చింతలపురి చిన్నయ్యస్వామి మఠంలో ఏకాదశి ఉత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామం నుంచి చిన్నయ్యస్వామి మఠం వరకు ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు. అలాగే మఠాధిపతులకు ప్రత్యేక పూజలు చేసి భజనలు, నృత్యాలతో ఊరేగించారు. అనంతరం మఠంలో మూడు రోజులపాటు జరిగే ప్రత్యేక పూజలు ప్రారంభించారు. కార్యక్రమాల్లో పీఠాధిపతి నందీశ్వరస్వామి, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్
- హన్వాడ, మహమ్మదాబాద్, గండేడ్ మండలాల్లో గురుకుల పాఠశాలల సందర్శన


పెద్దదర్పల్లి వద్ద గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహమ్మదాబాద్: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని లోకల్‌బాడీస్ అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని నంచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలం సీజన్‌లో ఈగలు, దోమలతో రోగాలు సంభవిస్తాయని, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. భోజనం ఎలా పెడుతున్నారు, విద్యాబోధన ఎలా ఉన్నదని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అని, ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉన్నత విద్యతో మంచి ప్రయోజకులు కావాలని సూచించారు.

గండేడ్: మండలంలోని సల్కర్‌పేట్ మినీ గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులను పరిశీలించారు. పాఠశాల ఆవరణ, టాయిలెట్లు పరిశీలించారు. కొన్నింటికి డోర్లు సక్రమంగా లేకపోవడంతో వెంటనే వాటిని మరమ్మతు చేయించాలని ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డిని ఆదేశించారు. డ్రైనేజీని పొలాల్లో వదలడం చూసి.. అలా వదలకూడదని ఒక సోక్‌పీట్ ఏర్పాటు చేసుకొని దాంట్లోకి వదలాలని ప్రిన్సిపాల్ రాగిణి, ఎంపీడీఓకు సూచించారు. అనంతరం కిచెన్, స్టోర్ రూం, డార్మెంటరీ, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు ఏ అవసరాలున్నా.. తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

హన్వాడ: మండలంలోని పెద్దదర్పపల్లి సమీపంలోని ఎంజేపీ బీసీ బాలికల గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలో విద్యార్థుల కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలకేంద్రంలోని ఎంజేపీ బీసీ బాలికల గురుకులాన్ని సందర్శించారు. అక్కడ విద్యార్థినులకు సరైన వసతులు లేకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ యశోదమ్మ, ఎంపీఓ జగదీశ్, పంచాయతీ కార్యదర్శులు దీప్తి, రాజాగౌడ్, ఆయా పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల పరిశీలన

మిడ్జిల్: కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి మండల కేంద్రంలోని కేజీబీవీ, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్ ఆకస్మికంగా మండల అధికారులతో కలిసి పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆయనవెంట ఎంపీడీఓ గీతాంజలి, అనంద్, శ్రావన్ తదితరులు ఉన్నారు.


మిడ్జిల్ కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి


వేములలో మాట్లాడుతున్న పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్

అడ్డాకుల: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకుని సత్తా చాటేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ పిలుపునిచ్చారు. మూసాపేట మండలం వేముల, తుంకినీపూర్‌లో శనివారం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సమన్వయ కమిటీ సభ్యులు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు పాత, కొత్త నాయకులు సమన్వయంతో ముందుకుసాగాలని చెప్పారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు పార్టీకి అండగా ఉండేలా నాయకులు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జగదీశ్వర్, రామన్‌గౌడ్, నాగిరెడ్డి, శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, బాలనర్సింహులు, గోవర్ధన్, లక్ష్మీనారాయణ, యాదయ్య, తిరుపతయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

రాజీలేని పోరాటంతోనే రిజర్వేషన్ ఫలాలు


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి

మహబూబ్‌నగర్ రూరల్: 30ఏళ్లుగా సజీవంగా నిలబడి లక్ష్యాన్ని ముద్దాడిన ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్ మాత్రమేనని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి అన్నారు. 30ఏళ్లలో దండోరా జెండా సమస్త పీడిత అణగారిన వర్గాలకు అండగా నిలిచిందన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన అందకపోవడంతోనే మాదిగలు అన్నిరంగాల్లో వెనుకబడిపోయారని, జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలని మందకృష్ణమాదిగ నేతృత్వంలో 30 ఏళ్ల రాజీలేని పోరాటం సాగిందన్నారు. ఆ ఫలితంగానే నేడు తెలంగాణలో వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చిందని, మాదిగలకు 9శాతం రిజర్వేషన్లు దక్కాయన్నారు. రిజర్వేషన్ ఫలాలను మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు అందిపుచ్చుకొని అన్నిరంగాల్లో అభివృద్ధిలోకి రావాలని పిలుపునిచ్చారు. ఈనెల 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా చేసుకోవాలని, ప్రతిగ్రామంలో దండోరా జెండా ఆవిష్కరించాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు శ్రీరాములు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివకుమార్, నాయకులు జంగయ్య, బాలరాజు, రామచంద్రం, కొండయ్య, సురేశ్, రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'పెట్టుబడిదారుల లబ్ధికే లేబర్ కోడ్‌లు'


తెలంగాణ చౌరస్తా వద్ద బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చడానికే లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేశ్ ఆరోపించారు. శనివారం ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ టౌన్ హాల్ నుంచి కొత్త బస్టాండు, న్యూటౌన్, రాజేంద్రనగర్, రైల్వేస్టేషన్, ఎర్రసత్యం చౌరస్తా మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కొద్దిసేపు ధర్నా నిర్వహించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు రాములు, సాంబశివుడు, ఖమర్‌అలీ, గాలన్న, చంద్రకాంత్, రాజ్‌కుమార్, తిరుమలయ్య, యాదయ్య, రంగన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం హర్షణీయం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు హర్షణీయమని ఆల్‌హైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. ఈ మేరకు విద్యాభివృద్ధిపై సీఎం కార్యాలయానికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించినట్లు తెలిపారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్యపై నేరుగా దృష్టిసారించి కనీసం 20మంది విద్యార్థులు ఉన్నా కూడా పాఠశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని, ఉర్దూ మీడియం పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని రాజేంద్రనగర్ సద్దల్‌గుండులోని పరిమళగిరి ఉర్దూ మీడియం పాఠశాల దాదాపు 30 ఏళ్లకుపైగా అద్దె భవనంలో కొనసాగుతుందని, ఇలాంటి పాఠశాలలను గుర్తించి అన్ని వసతులతో సొంత భవనాలు నిర్మించాలని కోరారు. 1 తరగతి నుంచి 5వరకు ప్రైమరీ పాఠశాలల్లో కనీసం నలుగురు ఉపాధ్యాయులు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దాతలు సహకరించడం అదృష్టం



వస్తువులను బహూకరిస్తున్న వరప్రసాద్ కుటుంబ సభ్యులు

గండేడ్: గ్రామీణ ప్రాంతాల్లో విద్య అభ్యున్నతికి దాతలు సహకిరంచడం అదృష్టమని గండేడ్ ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ వసతిగృహానికి ఫిలడెల్ఫియా ఆఫ్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యావారధి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బంకర్ బెడ్లు, పరుపులు, దుప్పట్లు, కుర్చీలు, టేబుళ్లు, ఆన్‌లైన్ ట్యూషన్ చెప్పడానికి పెద్ద టీవీని విద్యావారధి కోఆర్డినేటర్ వరప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి విద్యార్థులకు బహూకరించారు. అనంతరం తన మామ తాటికొండ సుదర్శన్ 75వ జన్మదిన వేడుకలను విద్యార్థులతో కలిసి నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూతనివ్వడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జనార్దన్, వార్డెన్ కృష్ణ, కలం డైరీ చెస్ కోఆర్డినేటర్ మహిపాల్‌రెడ్డి, పీటీఏ ప్రతినిధులు సాయికమల్, శ్రీధర్, విద్యావారధి ఇన్‌చార్జి జనార్దన్, పీడీ రాములు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



చిన్నచింతకుంట: మండల కేంద్రంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారులు ముగ్గుపోసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి విష్ణు మాట్లాడుతూ.. నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, రవి తదితరులు ఉన్నారు.

'కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి'


కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కార్యదర్శి ఎర్ర నర్సింహులు పిలుపునిచ్చారు. శనివారం బాదం సరోజినీదేవి- బాదం రామస్వామి ఆడిటోరియం ఎదుట సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు వివిధ రూపాల్లో పనులను మార్పు చేయడం తగదన్నారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ చట్టబద్ధం చేసిన కేంద్రం చివరకు రెగ్యులర్ ఉద్యోగుల భద్రతకు ముప్పు తెచ్చిందని ఆరోపించారు. 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, కోశాధికారి చంద్రకాంత్, ఆయా సంఘాల నాయకులు రాజ్‌కుమార్, గాలన్న, యాదమ్మ, బాలరాజు, రమేశ్, శంకర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మధ్యాహ్న భోజనం పరిశీలన



నవాబ్‌పేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సునీత సూచించారు. శనివారం ఆమె మండల అధికారులతో కలిసి మండల కేంద్రంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందించే భోజనం తయారీ, బియ్యం తదితర వస్తువులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సిలబస్‌పై చర్చించి పాఠ్యాంశాలపై ఆరాతీశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ముందుకు సాగాలన్నారు. ఎంపీడీఓ జయరాంనాయక్, ఈఓపీఆర్డీ నసీర్, ఎస్ఓ మాధవి తదితరులు ఉన్నారు.

'చలో సీడీఎంఏను జయప్రదం చేద్దాం'


మాట్లాడుతున్న వెంకటేశ్

జడ్చర్ల టౌన్: రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 23న తలపెట్టిన చలో హైదరాబాద్ సీడీఎంఏ కార్యాలయం ధర్నా జయప్రదం చేద్దామని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో నిర్వహించిన మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అపరిష్కృత సమస్యల పరిష్కారానికి చేపట్టిన ధర్నాకు వర్కర్లు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. పోరాడితేనే హక్కులు సాధించుకోవచ్చన్నారు. అలాగే ఈనెల 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను దగా చేస్తున్నాయని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, పట్టణ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ, కార్మికులు రాజు, కేశవులు, యాదమ్మ, శివలీల, శ్యామల, విద్యాసాగర్, పాండు, శ్రీను, ఇందిరమ్మ, లక్ష్మమ్మ, సహదేవ్, కార్మికులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా


నవాబ్‌పేటలో రైతులకు యూరియా అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవాబ్‌పేట: రైతులకు యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచామని సహకార సంఘం చైర్మన్ నర్సింహులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పీఏసీఎస్‌లో రైతులకు యూరియా అందించే కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యూరియా కోసం ఇబ్బందులు పడకుండా రైతులు కావాల్సినంత అందుబాటులో ఉంచామన్నారు. యూరియా కొరత ఉందని అపోహలు నమ్మి యూరియాను స్టాక్ చేయకూడదని వివరించారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరకు రైతులు యూరియాను కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ హన్మంత్, సహకార సంఘం డైరెక్టర్లు ప్రతాప్, శశిధర్‌రెడ్డి, వెంకటేశ్, తాహేర్, మాజీ సర్పంచులు ఉన్నారు.

ఇసుక తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

మాగనూర్: మండల కేంద్రంగా వాడూరం నుంచి జరుగుతున్న ఇసుక తరలింపును గ్రామస్తులు అడ్డుకున్నారు. మండల కేంద్రంలోని పెద్దవాగు నుంచి కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భాగంగా పైపుల తయారు పనులకు ఇసుక తరలిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో ఇసుక తరలింపు వలన బోర్లు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఇసుకను తీసుకెళ్తున్న టిప్పర్లను శనివారం గ్రామస్తులు మరోసారి అడ్డుకున్నారు. ఇసుకను తరలించడం వల్ల గ్రామానికి తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో పాటు వాగు పరివాహక ప్రాంతాల సాగు భూములు ఎడారిగా మారుతాయని వాపోతున్నారు. తమ గ్రామం నుంచి కాకుండా మరో చోట నుంచి ఇసుకను తీసుకెళ్లాలని చెబుతున్నా అధికారులు మాత్రం ఇక్కడే ఇసుక తరలిస్తామని మొండి పట్టుపట్టడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మాగనూర్ గ్రామ సమీపంలోని పెద్ద వాగు నుంచి ఇసుక తరలింపును ఎట్టి పరిస్థితులో జరగనివ్వబోమని స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామస్తులు సమావేశమై తీర్మానం చేశారు. అవసరమైతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


వాగులో ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

పార్టీ అభ్యర్థులను గెలిపించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జనార్దన్‌రెడ్డి

మిడ్జిల్: త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసే అభ్యర్థులు విజయం సాధించేందుకు పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జనార్దన్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపర్చడంలో విఫలం చెందిందని, నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి గురించి గ్రామాల్లో ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, మండలాధ్యక్షుడు నరేశ్ నాయక్, భీమయ్య, వెంకటయ్య, బుచ్చయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేపల మృతిపై ఆందోళన

జడ్చర్ల: స్థానిక కావేరమ్మపేట శివారులోని చెరువులో చేపలు మృతి చెందడంపై మత్స్యకార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులు తాము స్వాధీనం చేసుకున్న 30 కిలోల సామర్థ్యం కలిగిన 90 బస్తాల నల్లబెల్లంను చెరువులో పారబోశారు. ఈ కారణంగా చెరువులోని నీరు కలుషితంగా మారిందని, ఫలితంగా చేపలు మృతిచెందాయని ఆరోపించారు. దీనిపై స్థానిక సీఐ విప్లవరెడ్డిని వివరణ కోరగా.. బెల్లం వల్ల చేపలు మృతిచెందే అవకాశం లేదని, అయినా తాము నీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతామని తెలిపారు.

చిరుతను పట్టుకోవాలని రైతుల వినతి

మహమ్మదాబాద్: నాలుగైదు రోజులుగా గాధిర్యాల్ అటవీప్రాంతంలో కొనెంగల గుట్టపై ఉన్న చిరుతను పట్టుకోవాలని పలుమార్లు అటవీశాఖ అధికారులకు తెలిపినా ఫలితం లేకపోతున్నదని గాధిర్యాల్ రైతులు ఆరోపిస్తున్నారు. రెండురోజుల క్రితం కనబడిన చిరుత మళ్లీ శనివారం ఉదయం కూడా అదే గుట్టలోని ఓ గుండుపై కనబడడంతో చుట్టూ పొలాల రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గుట్టచుట్టూ పొలాల రైతుల పశువుల కొట్టాలు, గొర్రెలు, మేకలు ఉన్నాయని రైతులపై దాడులు చేస్తే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అటవీశాఖ అధికారులు గమనించి చిరుతను పట్టుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎఫ్ఆర్ఓను వివరణ కోరగా కొందరు రైతులు చిరుత ఉన్నదన్న విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం అటవీశాఖ సిబ్బందిని పంపించి కెమెరాతో గుర్తించనున్నట్లు ఎఫ్ఆర్ఓ అబ్దుల్‌హై తెలిపారు.



సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

ఆత్మకూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి వార్డుల అధికారులు పాటుపడాలని, నిత్యం స్థానికంగా ఉండే అందరికీ అందుబాటులో ఉండాలని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డుల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్యం, వనమహోత్సవం, ఇంకుడుగుంతల నిర్మాణాలు తదితర విషయాలపై పట్టణ వాసులకు అవగాహన కల్పించాలని వివరించారు. 100 రోజుల ప్రణాళిక, తాగునీటి వనరులు, ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన, పారిశుద్ధ్య పనులు, ట్రేడ్ లైసెన్సులు, జనన, మరణ ధ్రువీకరణ, భవన నిర్మాణ అనుమతులు, అక్రమ నిర్మాణాలపై చర్యలు, ఫ్లెక్సీల ఏర్పాటుపై పన్నుల వసూలు, వీధిదీపాల నిర్వహణ, వనమహోత్సవంలో భాగంగా లక్ష్యానికిమించి మొక్కలు నాటాలన్నారు.

కాలువలపై నిర్మాణాలు చేపడితే చర్యలు

కోస్గి రూరల్: నీటి పారుదలశాఖ ఆధీనంలోని కుంటలు, కాలువలపై నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని నీటిపారుదలశాఖ డీఈ ఆనంద్‌కిషోర్ అన్నారు. శనివారం పట్టణంలోని పాతపూరికుంటలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలియడంతో పరిశీలించారు. పలువురు నిర్మాణాలు చేపట్టగా నోటీసులు జారీ చేసి అనుమతులు రద్దు చేయాలన్నారు. ఇకపై ఎవరైనా కాలువలు, కుంటలలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.